యాదగిరీశుడికి వైభవంగా దర్బార్ సేవ

యాదగిరిగుట్ట, మార్చి 27: యాదగిరి గుట్ట లక్ష్మీనరసింహస్వామికి బుధవారం సాయంత్రం దర్బార్ సేవోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. స్వామి, అమ్మవార్లను దివ్యమనోహరంగా అలంకరించి ప్రధానాలయ ముఖ మండపంలో వేంచేపు చేసి వేద పారాయణం చేశారు. స్వామివారికి నక్షత్ర హారతి ఇచ్చి మంత్రపుష్ప నీరాజనం చేశారు. భక్తులు పాల్గొని మొక్కలు చెల్లించుకున్నారు. అర్చకులు తెల్లవారు జామునే ఆలయాన్ని తెరిచి సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన జరిపి, ఉదయం ఆరగింపు చేపట్టారు. స్వయంభూ ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శనభాగ్యం కల్పించారు. స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవ సేవ అత్యంత వైభవంగా సాగింది. స్వామివారి కల్యాణంలో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం స్వామివారికి తిరువీధిసేవ చేపట్టారు. రాత్రి స్వామివారి తిరువారాధన చేపట్టారు. పాతగుట్ట స్వామివారికి నిత్యారాధనలు అత్యంత వైభవంగా సాగాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు కొనసాగాయి.

సుమారు 9 వేల మంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలను కలుపుకొని స్వామివారి ఖజానాకు రూ.13,71,064 ఆదాయం సమకూరిందని ఈఓ భాస్కర్ రావు తెలిపారు.

కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేసే బీజేపీని ఓడించాలి

- సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు

సమావేశంలో మాట్లాడుతున్న చెరుపల్లి సీతారాములు

రామన్నపేట, మార్చి27: దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు దోచి పెడుతూ వారి ఊడిగం చేసే బీజేపీని రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు పిలుపునిచ్చారు. బుధవారం మండలకేంద్రంలోని పార్టీ కార్యాయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం సీబీఐ, ఈడీ వంటి కేంద్ర సంస్థల ద్వారా ప్రాంతీయ పార్టీలను బెదిరింపులకు గురి చేస్తూ ప్రజాస్వామ్యాన్ని నిర్వీర్యం చేస్తుందన్నారు. భారత రాజ్యాంగాన్ని మార్చేందుకు కుట్ర చేస్తున్న బీజేపీని ఓడించాల్సిన అవసరం ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. సమావేశంలో భువనగిరి పార్లమెంట్ సీపీఎం అభ్యర్థి జహంగీర్, నాయకులు బొంతల చంద్రారెడ్డి, కొండమడుగు నర్సింహ, బట్టుపల్లి అనూరాధ, మేక అశోక్ రెడ్డి, మాటూరి బాలరాజు పాల్గొన్నారు.

మల్లారెడ్డికి నివాళి

యాదగిరిగుట్ట : మండలంలోని కాచారంలో మంగళవారం రాత్రి అమరజీవి దుంపల మల్లారెడ్డి 18వ వర్ధంతి సభ నిర్వహించారు. సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వీరయ్య, మండల కార్యదర్శి బబ్బూరి పోశెట్టి, నాయకులు మల్లారెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

మతోన్మాదాన్ని ప్రేరేపిస్తున్న బీజేపీ

- పీవైఎల్ జిల్లా ప్రధాన కార్యదర్శి బెజాడికుమార్

సమావేశంలో మాట్లాడుతున్న పీవైఎల్ జిల్లా ప్రధాన కార్యదర్శి బేజాడి కుమార్

భూదాన్ పోచంపల్లి, మార్చి 27 : కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం మతాన్మాదాన్ని ప్రేరేపిస్తూ, ప్రజలను విభజిస్తున్నదని ప్రగతిశీల యువజన సంఘం (పీవైఎల్) జిల్లా ప్రధాన కార్యదర్శి బెజాడి కుమార్ తెలిపారు. బుధవారం పట్టణ కేంద్రంలోని రమాదేవి ఫంక్షన్‌హాల్లో పీవైఎల్ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సమరయోధులు భగత్‌సింగ్, రాజ్‌గురు సుఖదేవ్ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు పరం చేస్తూ ప్రజాధనాన్ని కొందరికి అప్పనంగా ధారాదత్తం చేస్తుందన్నారు. భగత్‌సింగ్ ఆశయ సాధన కోసం యువత కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా సహాయ కార్యదర్శి చిరబోయిన బాలకృష్ణ, జిల్లా నాయకులు ఆకుల కృష్ణ, రాచకొండ ఉదయ్, పట్టణ కార్యదర్శి పగుడాల శివ, నాయకులు నోముల శివకుమార్, సతీశ్, గోవర్ధన్, మహేశ్, సాయి, సంతోష్ పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో షాపు దగ్ధం

అగ్నిప్రమాదంతో షాపులో దగ్ధమైన వస్తువులు

భూదాన్ పోచంపల్లి, మార్చి 27: మండల కేంద్రంలోని గాయత్రీ ఎలక్ట్రికల్ షాపులో మంగళవారం రాత్రి షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగి సామగ్రి దగ్ధమైంది. షాపు యజమాని దుకాణాన్ని మూసి ఇంటికి వెళ్లాడు. అర్ధరాత్రి దుకాణం నుంచి పొగలు వస్తుండడంతో స్థానికులు గమనించి షాపు యజమానికి, అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. ఫైర్ సిబ్బంది అక్కడికి చేరుకొని మంటలను ఆర్పివేశారు. షాపులో ఉన్న ప్లాస్టిక్ వస్తువులు, రంగుల డబ్బాలు, ఇతర వస్తువులు కాలిపోయాయి. సుమారు రూ.15 లక్షల నష్టం వాటిల్లినట్లు షాపు యజమాని సీత శేఖర్ ఆవేదన వ్యక్తం చేశారు. యజమాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ భాస్కర్‌రెడ్డి తెలిపారు.

108 సేవలను సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ నజీరుద్దీన్



వాహనాన్ని తనిఖీ చేస్తున్న నజీరుద్దీన్

వలిగొండ, మార్చి 27: మండల కేంద్రంలోని 108 వాహనాన్ని అంబులెన్స్ సేవల ఉమ్మడి జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ నజీరుద్దీన్ బుధవారం తనిఖీ చేశారు. వాహనంలోని వైద్య పరికరాల పనితీరు, అత్యవసర సమయాల్లో వినియోగించే మందులు, రికార్డులను పరిశీలించారు. అత్యవసర సమయాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సిబ్బందికి సూచించారు. అత్యవసర సమయాల్లో 108 వాహనం సేవలను వినియోగించుకొని ప్రాణాలను కాపాడాలని ప్రజలకు సూచించారు. ఆయన వెంట 108 సిబ్బంది శివరాం, దినేశ్, నరేశ్ వర్మ ఉన్నారు.

క్రికెట్ పోటీల విజేతలకు బహుమతులు

చౌటుప్పల్ రూరల్, మార్చి 27 : మండలంలోని ఎల్లగిరి తూప్రాన్‌పేట, ఖైతాపురం గ్రామాల పరిధిలో నిర్వహించిన ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు బుధవారం ముగిశాయి. లక్కీవారియర్స్‌కు మొదటి బహుమతి, ఇబ్రహీం రాయల్స్ ద్వితీయ బహుమతి గెలుచుకున్నారు. విజేతలకు ఎంపీపీ తాడూరి వెంకట్‌రెడ్డి బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత క్రీడల్లో రాణించి తమ ప్రాంతానికి పేరు తేవాలని కోరారు. కార్యక్రమంలో ఎల్లగిరి మాజీ సర్పంచ్ రిక్కల ఇందిరాసత్తిరెడ్డి,
నాయకులు రిక్కల భాస్కర్‌రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, కందగట్ల పద్మారెడ్డి, టోర్నమెంట్ నిర్వాహకులు పాల్గొన్నారు.

వ్యవసాయంలో జీవ నియంత్రణ పద్ధతులు పాటించాలి

- జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్త రామకృష్ణ బాబు



గిరిజన రైతులకు వ్యవసాయ ఉపకరణాలను పంపిణీ చేస్తున్న ఏడీపీ దేవ్ సింగ్ , శాస్త్రవేత్తలు రామకృష్ణ, అనిల్ కుమార్

భూదాన్ పోచంపల్లి, మార్చి 27: రైతులు వ్యవసాయంలో జీవ నియంత్రణ పద్ధతులు పాటిస్తే పంటను ఆశించే తెగుళ్లను సులభంగా అరికట్టవచ్చని ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ శాస్త్రవేత్త ఎ.రామకృష్ణ బాబు అన్నారు. బుధవారం భూదాన్ పోచంపల్లి మండలం పెద్ద రావులపల్లి గ్రామంలోని రైతు వేదికలో రైతు సదస్సు నిర్వహించారు. పంటలపై పురుగులు, తెగుళ్ల నియంత్రణ, గిరిజన ఉప ప్రణాళిక, వరిలో సమగ్ర సస్యరక్షణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయంలో కాండం తొలుచు పురుగు నివారణకు లింగాకర్షక బుట్టలను ఉపయోగించడంతో పురుగులను ముందుగానే పసిగట్టి నివారించవచ్చన్నారు. పర్యావరణాన్ని దృష్టిలో ఉంచుకొని రైతులు వ్యవసాయం చేస్తే మంచి ఆదాయంతో పాటు కలుషితం లేని పంట దిగబడి సాధించి మార్కెట్లో అధిక రేటు పొందవచ్చునని తెలిపారు. 60 మంది గిరిజన రైతులకు ఉప ప్రణాళిక కింద ఎకరా వరి పంటకు సరిపడే లింగాకర్షక బుట్టలు, ట్రైకోగ్రామ పరాన్న జీవులు, వేప నూనె, సూడోమోనాస్ ఫ్లోరోసిస్, జీవ నియంత్రణ ఉపకరణాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ అనిల్ కుమార్, వ్యవసాయ శాఖ ఉపసంచాలకుడు భూక్య దేవ్‌సింగ్, మండల వ్యవసాయ అధికారి ఎజాజ్ అలీఖాన్, విస్తరణ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

యాదగిరిగుట్ట ఆలయం అద్భుతం

– నావల్ స్టాఫ్ చీఫ్ హరికుమార్

హరికుమార్‌కు స్వామివారి ప్రసాదం అందిస్తున్న ఆలయ ఈఓ భాస్కర్‌రావు

యాదగిరిగుట్ట, మార్చి27: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయం అద్భుత దేవాలయమని నావల్ స్టాఫ్ చీఫ్, ఇండియన్ నేవీ, ఇండియర్ ఆర్మ్డ్ ఫోర్సెస్ గౌరవ ఆడ్మిరల్ ఆర్. హరికుమార్ పేర్కొన్నారు. బుధవారం లక్ష్మీనరసింహస్వామిని ఆయన కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. యాదగిరిగుట్టకు చేరుకున్న ఆయనకు ఆలయ ప్రధానార్చక బృందం పూర్ణకుంభంతో స్వాగతం పలికింది. అనంతరం ఆయన స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అర్చకులు వేద ఆశీర్వచనం చేయగా ఈఓ భాస్కర్‌రావు మహాప్రసాదాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆడ్మిరల్ ఆర్. హరికుమార్ దేవస్థాన విజిటర్ బుక్‌లో తన అనుభూతిని రాశారు. ఆయన వెంట ఆలయ డీఈఓ దోర్బల భాస్కర్‌శర్మ, ప్రధానార్చకులు కాండూరి వేంకటాచార్యులు, అధికారులు, అర్చకులు, సిబ్బంది ఉన్నారు.

రక్తహీనతపై బాలికలకు అవగాహన

రాంపూర్ ఆదర్శ పాఠశాలలో బాలికలకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ సుధీర్‌రెడ్డి

తుర్కపల్లి, మార్చి 27 : మండలంలోని రాంపూర్ ఆదర్శ పాఠశాలలో బుధవారం పీఎంశ్రీ పథకంలో భాగంగా బాలికల ఆరోగ్య సమస్యలపై మండల వైద్యాధికారి సుధీర్‌రెడ్డి అవగాహన కల్పించారు. బాలికల్లో రక్తహీనత లక్షణాలు కనిపించిన వెంటనే చికిత్స అందించాలని, పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. ఆడపిల్లలపై వివక్ష, సెల్‌ఫోన్ అతి వినియోగం వల్ల నష్టాలపై అవగాహన కల్పించారు. విద్యార్థినులు బాగా చదువుకొని సమాజంలో మంచి స్థానంలో నిలువాలని కోరారు. సమావేశంలో పాఠశాల ప్రిన్సిపాల్ మధు ప్రకాశ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి యువకుడి ఆత్మహత్య

ఆత్మకూరు(ఎం), మార్చి 27 : మండలంలోని పారుపల్లి గ్రామానికి చెందిన పట్టూరి శివ (26) బుధవారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. శివ వ్యక్తిగత కారణాలతో జీవితంపై విరక్తి చెంది తన ఇంటి మేడపైకి ఎక్కి కూల్‌డ్రింక్‌లో పురుగులమందు కలుపుకొని తాగి అపస్మారక స్థితిలో పడిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స కోసం భువనగిరి ఏరియా దవాఖానకు తరలించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ ఎండీ యాకుబ్‌ఖాన్ తెలిపారు.

బాల్య వివాహాన్ని అడ్డుకున్న అధికారులు

మోత్కూరు, మార్చి 27: మున్సిపాలిటీ పరిధిలోని కొండగడపలో జరుగనున్న బాల్య వివాహాన్ని బుధవారం అధికారులు అడ్డుకున్నారు. గ్రామానికి చెందిన బాలికకు తల్లిదండ్రులు వివాహం చేస్తున్నారని స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు జిల్లా బాలల పరిరక్షణ విభాగం, చైల్డ్ హెల్ప్ లైన్ సిబ్బంది, పోలీసులు వెళ్లి వివాహాన్ని ఆపించారు. కుటుంబ సభ్యులకు బాల్యవివాహ చట్టంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ వెంకన్న, బాలల పరిరక్షణ విభాగం సిబ్బంది సీహెచ్ కవిత, దశరథ, నందిని, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

నేడు బార్ అసోసియేషన్ ఎన్నికలు

భువనగిరి అర్బన్, మార్చి 27: భువనగిరి బార్ అసోసియేషన్ ఎన్నికలు గురువారం భువనగిరి కోర్టు ఆవరణలో జరుగనున్నాయి. అసోసియేషన్ అధ్యక్ష స్థానం కోసం బబ్బూరి హరినాథ్, గజ్జల రవీందర్ రెడ్డి, ఉపాధ్యక్షుడి కోసం కల్వకుంట్ల జయ, డి.జగన్‌మోహన్‌రెడ్డి పోటీ పడుతున్నారు. మొత్తం 142 మంది ఓటర్లు ఉన్నారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఎన్నికలు జరుగనున్నాయి.

పాముకాటుతో పదో తరగతి విద్యార్థి మృతి

ఉమేశ్(ఫైల్)

మోత్కూరు, మార్చి 27 : పాము కాటుతో పదో తరగతి విద్యార్థి మృతి చెందిన ఘటన మండలంలోని దత్తప్పగూడెం గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. గామస్తులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన ముక్కెర్ల కుమార్, మమత దంపతుల కుమారుడు ఉమేశ్(15) స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతూ ప్రస్తుతం వార్షిక పరీక్షలు రాస్తున్నాడు. మంగళవారం రాత్రి తన తల్లిదండ్రులతో కలిసి ఇంట్లో కింద పడుకున్నాడు. అర్ధరాత్రి కట్ల పాము కాటు వేసింది. తనను ఏదో కరిచిందని ఉమేశ్ తల్లిదండ్రులకు చెప్పాడు. వారు లేచి వెతకగా గ్యాస్ సిలిండర్ కింద కట్ల పాము కనిపించడంతో దానిని చంపేశారు. ఇంతలో విష ప్రభావంతో అస్వస్థత గురయ్యాడు. దాంతో తల్లిదండ్రులు అతడిని ఆటోలో భువనగిరి ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు.

నీటి కుంటలో పడి యువకుడు..

ఉమేశ్(ఫైల్)

యాదగిరిగుట్ట, మార్చి 27: మండలంలోని మల్లాపురం గ్రామానికి చెందిన నవీన్(27) బుధవారం ప్రమాదవశాత్తు నీటి కుంటలో పడి మృతి చెందాడు. గ్రామానికి చెందిన కర్రె నర్సింహులు, పారిజాత దంపతులకు ముగ్గురు కుమారులు. వీరిలో పెద్ద కొడుకు నవీన్ తమ మామిడితోటకు కాపలాగా ఉంటున్నాడు. మామిడితోటలో ఉన్న నీటి కుంటలో ప్రమాదవశాత్తు కాలు జారిపడి పడి మృతి చెందాడు. విషయాన్ని ఆలస్యంగా గమనించిన తల్లిదండ్రులు గ్రామస్తుల సాయంతో కుంటలోని నీటిని తోడి నవీన్ మృత దేహాన్ని బయటికి తీశారు. నవీన్‌కు ఆరునెలల క్రితమే వివాహమైంది.

చిన్నారిపై లైంగిక దాడికి పాల్పడిన యువకుడికి రిమాండ్

చౌటుప్పల్ రూరల్, మార్చి 27 : మండలంలోని దండు మల్కాపురం గ్రామంలో సోమవారం రాత్రి చిన్నారిపై లైంగిక దాడికి పాల్పడిన నిందితుడు శివ(25)పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చౌటుప్పల్ సీఐ అశోక్‌రెడ్డి తెలిపారు. గ్రామ పరిధిలోని రసాయనిక పరిశ్రమలో పని చేసేందుకు కొందరు కూలీలు వలస వచ్చి పరిశ్రమ ఆవరణలో నివాసం ఉంటున్నారు. నిందితుడు పాపను ఆడించేందుకు బయటికి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ విషయమై పాప తల్లి దండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు మేరకు నిందితుడిని అరెస్ట్ చేశామని, చిన్నారిని హైదరాబాద్‌లోని నీలోఫర్ ఆస్పత్రికి తరలించి మెరుగైన చికిత్స అందిస్తున్నట్లు సీఐ తెలిపారు.

భూదాన్‌పోచంపల్లి : పద్మానగర్ కాలనీలో నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్లు

నిరుపయోగంగా పబ్లిక్ టాయిలెట్స్

భూదాన్ పోచంపల్లి, మార్చి 25 : మండల కేంద్రంలోని తాసీల్దార్ కార్యాలయం పక్కన ప్రజల సౌకర్యార్థం రూ.లక్షల వ్యయంతో నిర్మించిన పబ్లిక్ టాయిలెట్స్ నిరుపయోగంగా ఉన్నాయి. నీటి సౌకర్యం లేకపోవడంతో అవి ప్రస్తుతం అలంకారప్రాయంగా మారాయి. ప్రభుత్వ కార్యాలయాలకు వివిధ గ్రామాల నుంచి నిత్యం ప్రజలు పెద్ద సంఖ్యలో వస్తుంటారు. అయితే పబ్లిక్ టాయిలెట్స్ అందుబాటులో లేక పోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకొని మరుగుదొడ్లను వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

బీజేపీ పోచంపల్లి మండల కార్యదర్శిగా విజయ్

భూదాన్ పోచంపల్లి, మార్చి 27 : బీజేపీ మండల కార్యదర్శిగా మండలంలోని కప్రాయపల్లి గ్రామానికి చెందిన గంగదేవి విజయ్ ముదిరాజ్‌ను నియమిస్తున్నట్లు పార్టీ మండలాధ్యక్షుడు గుండ్ల రాజు యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు. తన నియామకానికి సహకరించిన వారికి విజయ్ కృతజ్ఞతలు తెలిపారు.

వైద్య విద్యార్థులకు అభినందన

రాజాపేట, మార్చి 27:మండల కేంద్రానికి చెందిన నంగునూరి కావ్య, చాట్లపల్లి అమూల్య ఎంబీబీఎస్ ఫైనలియర్ ఫలితాల్లో ప్రతిభ కనబర్చి కళాశాలల్లో టాపర్‌గా నిలిచారు. కావ్య ఆదిలాబాద్ ప్రభుత్వ వైద్యకళాశాలలో, అమూల్య హైదరాబాద్‌లోని ప్రైవేటు వైద్య కళాశాలలో చదువుతున్నారు. ఎంబీబీఎస్ ఫైనలియర్ ఫలితాల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థినులను రాజాపేట గ్రామస్తులు బుధవారం అభినందించారు.

భువనగిరి తై బజార్ వేలం వాయిదా

భువనగిరి అర్బన్, మార్చి 27: భువనగిరి మున్సిపాలిటీ పరిధిలో నిర్వహించే తై బజార్ బహిరంగ వేలాన్ని వాయిదా వేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ పి.రామానుజులరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 29న నిర్వహించనున్న వేలాన్ని హైకోర్టు ఉత్తర్వుల మేరకు వాయిదా వేశామని, ఈ విషయాన్ని వేలంలో పాల్గొనే వారు గమనించాలని సూచించారు.

నిరుపయోగంగా సెగ్రిగేషన్ షెడ్

కొలనుపాకలో నిరుపయోగంగా ఉన్న సెగ్రిగేషన్ షెడ్

ఆలేరురూరల్, మార్చి 27 : గ్రామాలను చెత్త రహితంగా మార్చి.. ప్రజలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించేందుకు గత ప్రభుత్వం లక్షల రూపాయలు వెచ్చించి ప్రతి గ్రామంలో సెగ్రిగేషన్ షెడ్డును నిర్మించింది. దాంతో పాటు ప్రతి గ్రామ పంచాయతీకి ట్రాక్టర్‌ను అందించి ఇంటింటికి వెళ్లి చెత్త సేకరించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. అయితే ప్రస్తుతం గ్రామాల్లో సెగ్రిగెషన్ షెడ్‌ల నిర్వాహణను పట్టించుకోక పోవడంతో నిరుపయోగంగా మారాయి. గతంలో తడి, పొడి చెత్తను వేరువేరుగా సేకరించి సెగ్రిగేషన్ షెడ్‌లో చెత్త నుంచి సెంద్రియ ఎరువు తయారు చేసేవారు. ప్రస్తుతం గ్రామ పంచాయతీ అధికారులు ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరణను మర్చిపోయారు. దాంతో గ్రామాల్లోని వీధుల్లో, రోడ్లపై చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. గతంలో పరిశుభ్రంగా ఉండే గ్రామాలు నేడు చెత్త మయమయ్యాయి. ఇప్పటికైన సంబంధిత అధికారులు స్పందించి పారిశుధ్య నిర్వాహణపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

మహిళా సంఘాలకు బ్యాంకు రుణాలు అందించాలి

- ఏపీఎం కిరణ్

సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఎం కిరణ్

ఆత్మకూరు(ఎం), మార్చి 27 : మహిళా సంఘాల సభ్యులందరికీ బ్యాంకు రుణాలు అందేలా వీఓఏలు కృషి చేయాలని ఏపీఎం కిరణ్ సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని మండల సమాఖ్య కార్యాలయంలో నిర్వహించిన వీఓఏల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న బ్యాంకు రుణాలను సద్వినియోగం చేసుకోవడంతో పాటు వాటిని సకాలంలో చెల్లించాలన్నారు. మహిళా సంఘాల సభ్యులందరికీ ఆన్‌లైన్ లావాదేవీలపై అవగాహన కల్పించాలని కోరారు. సమావేశంలో ఎస్‌వీఈపీ ఏపీఎం ఆనంద్, సీపీఓ ఆడిటర్ బాల్‌రాజ్, సీసీలు వెంకన్న, భాస్కర్, వీఓఏలు నర్సింహ, స్వప్న, శ్యామల, శిరీష, విజయలక్ష్మి పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుధ్యం మెరుగు పర్చాలి

- ఎంపీపీ కన్నెబోయిన జ్యోతి

మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ కన్నెబోయిన జ్యోతి

రామన్నపేట, మార్చి 27: గ్రామాల్లో పారిశుధ్యం మెరుగు పరిచే పనులు చేపట్టాలని ఎంపీపీ కన్నెబోయిన జ్యోతి బలరాం ప్రత్యేకాధికారులకు సూచించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి ఆమె అధ్యక్షత వహించి మాట్లాడారు. గ్రామాల్లో వేసవి తీవ్రతను దృష్టిలో పెట్టుకొని నీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రజల సమస్యలు తెలుసుకొని ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కోరారు. అంతకు ముందు పలువురు ఎంపీటీసీ సభ్యులు తమ గ్రామాల్లోని సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చారు. అధికారులు తమ శాఖకు సంబంధించిన ప్రగతి నివేదికను సభముందు ఉంచారు. సమావేశంలో తాసీల్దార్ లాల్‌బహదూర్, ఎంపీడీఓ యాకూబ్‌నాయక్, వైస్ ఎంపీపీ నాగటి ఉపేందర్, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గురుదేవుడి మార్గం ఆచరణీయం : రామానంద ప్రభూజీ

పేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్న రామానంద ప్రభూజీ

బొమ్మలరామారం, మార్చి 27 : సత్యపదానంద స్వామి గురుదేవులు చూపిన మార్గం సమాజానికి ఆచరణీయమని సాయిదత్తా పీఠాధిపతి రామానంద ప్రభూజీ అన్నారు. సాయిధామం ఆశ్రమం వ్యవస్థాపకుడు స్వామి సత్యపదానంద ప్రభూజీ 85వ జయంతి వేడుకలను బుధవారం మండలంలోని పెద్దపర్వతాపూర్ గ్రామంలోని సాయిధాయం సేవాశ్రమంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూల మాల వేసి ప్రత్యేక పూజలు, అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు చంద్రారెడ్డి, నర్సింగ్‌రావు, మల్లేశ్, సాయి భక్తులు పాల్గొన్నారు.

రామలింగేశ్వరాలయంలో ఎమ్మెల్యే సామేలు పూజలు

ఆలయంలో పూజలు చేస్తున్న తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్

మోత్కూరు, మార్చి 27: మున్సిపాలిటీ కేంద్రంలోని రామలింగేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో బుధవారం తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు పాల్గొన్నారు. స్వామివారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. ఆయన వెంట మున్సిపల్ చైర్పర్సన్ గుర్రం కవితా లక్ష్మీనర్సింహారెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ గుండగోని రామచంద్రు గౌడ్, నాయకులు ఉన్నారు.

ఓటరు జాబితాను పకడ్బందీగా రూపొందించాలి

ఎక్సైజ్ సీఐ దీపిక

సొసైటీ సభ్యులకు సూచనలిస్తున్న ఎక్సైజ్ సీఐ దీపిక

ఆలేరురూరల్, మార్చి 27 : మండలంలోని కొలనుపాక కల్లుగీత పారిశ్రామిక సహకార సంఘం కార్యవర్గ ఎన్నికలు జరుగనున్న దృష్ట్యా సభ్యులతో కూడిన ఓటరు జాబితాను పకడ్బందీగా రూపొందించాదలని ఎక్సైజ్ సీఐ దీపిక సూచించారు. బుధవారం సొసైటీని సందర్శించి పలు సూచనలు చేశారు. మొదటగా సభ్యులను నిర్ధారించి, ప్రతి ఒక్కరికి గుర్తింపు కార్డు ఉండేలా చూడాలన్నారు. ఆమె వెంట ఎక్సైజ్ ఎస్ఐ విజయ్, గౌడసంఘం మాజీ అధ్యక్షుడు దూడల భాగయ్య, నాయకులు బైరి రమేశ్‌గౌడ్, బైరి పాపరాజు, నమిలే రాజయ్య ఉన్నారు.